మురుగు సమస్య తీరదా?

- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



చెరువును తలపిస్తున్న మురుగునీరు



ఇటీవల కురిసిన వర్షానికి ఏరులై పారిన మురుగునీరు(ఫైల్ ఫోటో)

నందిగామ: మండలంలోని సల్వేంద్రిగూడ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది.. ఈ గ్రామంలో అభివృద్ధి పైన పటారం..లోన లోటారం అన్న చందంగా మారింది.. చూడడానికి సీసీ రోడ్లు, అంతర్గత మురుగుకాల్వలు కనిపిస్తాయి. కానీ, ఆ ఊరు మురుగు నీరు వెళ్లేందుకు దారి లేక ఒకే చోట నిలిచి పోతుంది. దీంతో అక్కడి స్థానికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అప్పుడలా..

సల్వేంద్రిగూడలో నిర్మించిన అంతర్గత మురుగు కాల్వల నుంచి వస్తున్న నీరంతా గ్రామానికి ఆనుకొని ఉన్న గ్రామ కంఠం భూమిలో నుంచి పక్కనున్న చెరువు, కుంటలోకి చేరేది. దీంతో గ్రామంలో ఎలాంటి సమస్యలు లేవు.

ఇప్పుడిలా..

గ్రామానికి చెందిన మురుగు నీరు వెళ్లే ప్రాంతంలో గ్రామ కంఠం భూమిని ఆనుకొని ఓ వెంచర్ గతంలో వెలసింది. ఆ వెంచర్ నిర్వాహకులు తమ లే అవుట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీంతో మురుగు నీరు సైతం ఆ వెంచర్‌లోకి చేరేలా పైపులైన్లను వేశారు. వెంచర్‌లోకి చేరిన ఆ మురుగు నీరు వెళ్లేందుకు దారి లేక ఒకే చోట నిలిచిపోయి చెరువును తలపిస్తోంది.

దుర్వాసన వెదజల్లుతోంది..

మురుగు నీరంతా ఒకే చోట చేరడంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు అసహనం వ్యక్త చేస్తున్నారు.మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. వానాకాలం ప్రారంభమైందని ఒకటి, రెండు వానలు కురిస్తే తాము అక్కడ నివసించలేమని , మురుగు నీరు ఇంటి వాకిట్లోకి చేరుకుంటుందని ఆందోళన చెందుతున్నారు.

దుర్వాసనతో ఉండలేక పోతున్నాం..



ఊరి మురుగు నీరంతా మా ఇంటి పక్కనే నిలిచిపోయింది. చెరువులా మురుగు నీరు పేరుకుపోయింది. దీంతో దోమల, దుర్వాసన వెదజల్లుతోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలన్నారు.

– పాశం ప్రభాకర్

రోగాల బారిన పడుతున్నాం..



మురుగు నీరు వల్ల దోమలు పెరిగిపోయి, దోమ కాటుతో అనారోగ్యాలకు గురవుతున్నాం. చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే భయమేస్తోంది. అసలే వర్షాకాలం సమస్యను పరిష్కరించకుంటే తాము ఆస్పత్రుల పాలవుతాం.

– మద్దూరి రాంచెందర్

త్వరలో సమస్య పరిష్కరిస్తాం..

సల్వేంద్రిగూడలో మురుగు నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. మురుగు నీరు ఒకే చోట ఉండడంతో స్థానికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడి ఆస్పతుల పాలవుతున్నారు. ఈ సమస్యను త్వరలో పర్కిరిస్తామని సర్పంచ్ వివరించారు. మురుగు నీరు వెళ్లేందుకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు.

– రమేష్ గౌడ్, సర్పంచ్, రంగాపూర్

క్షుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: మండలంలోని వెంకమ్మగూడలో నూతనంగా నిర్మాణం చేసిన మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవతలను పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా గ్రామదేవతలైన మైసమ్మ, ఎల్లమ్మ, పోచమ్మలను పూజిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సర్పంచులు రజనీత వీరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అశోక్, కుమార్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



బొడ్రాయి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్‌లో బుధవారం బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నడిబొడ్డును ఏర్పాటు చేసిన బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణవేణి, లతాశ్రీ, శ్రీశైలంగౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలను అందజేస్తున్న సర్పంచ్

కేశంపేట: మండలంలోని ఇప్పలపల్లిలో బుధవారం గ్రామానికి చెందిన మంద శేఖర్, ప్రవళికల పెళ్లికి సర్పంచ్ ఆంజనేయులు పుస్తెమెట్టెలను అందజేశారు. మందశేఖర్ తండ్రి ఇటీవలే మృతి చెందడంతో పెళ్లికి కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పుస్తె మెట్టెలను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాములు, చంద్రయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణారెడ్డి

కొందుర్గు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించనున్న విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఎమ్మార్సీఎస్ భవనంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంతవరకు విద్యార్థుల అడ్మిషన్ వివరాలను పాఠశాల వారిగా సమీక్షించారు. బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలను, ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు రవీందర్‌రెడ్డి, మల్లికార్జున గౌడ, ఉమామహేశ్వర్, విల్సన్ సునీల్ పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



భూమి పూజ చేస్తున్న పెంటయ్య

షాబాద్: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ సమ్మి పెంటయ్య అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లపల్లిలో నూతనంగా పోచమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులున్నారు.

క్రీడలతో క్రమశిక్షణ మెరుగు



టీ షర్టులు అందజేస్తున్న నర్సింహారెడ్డి

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండలంలోని సిద్ధాపూర్ మాజీ సర్పంచ్ ఎల్లారం నర్సింహ్మారెడ్డి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన చెన్నారెడ్డి సన్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ యువత, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో విద్యార్థులు, యువత పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో ఉద్యోగాలు సులువుగా సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే, టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు టీ షర్టులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్య, లక్ష్మణ్, కుమార్, ఖాజా, మైసయ్య, హరికృష్ణ, హైమద్‌ఖాన్, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం


పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



అవార్డు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పీఆర్ఆర్ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌పీఎల్–2లో ఆర్‌సీబీ, కేకేఆర్ క్రికెట్ మ్యాచ్ హోరాహోరిగా సాగుతున్నాయి. అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారులకు మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ..క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కృషి పట్టుదల, క్రమశిక్షణలు ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్, ఎంపీటీసీ అశోక్, రవీందర్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



ముస్తాబైన ఇప్పలపల్లి పంచాయతీ కార్యాలయం

కేశంపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు గ్రామాల్లో నిర్వహించనున్న పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సంగెం, అల్వాల, నిర్దవెల్లి, కొత్తపేట, లేమామిడి, తొమ్మిదిరేకుల, కాకునూర్, సుందరపూర్, కేశంపేట, ఇప్పలపల్లి గ్రామాల్లో బుధవారం రవిచంద్రకుమార్‌రెడ్డి పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో ఉదయం గ్రామసభలు, ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పల్లె ప్రకృతి వనాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించడం జరుగుతుందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న లావణ్య

షాద్‌నగర్: బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని చటాన్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు అశోక్‌యాదవ్‌లు హాజరయ్యారు. అలాగే, మండలంలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం రేవతి, ఉపాధ్యాయులు సర్వరాజ్ అన్వర్, జ్యోతి, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు.

బడిబాట విద్యార్థులకు బంగారు బాట

కొత్తూరు: బడిబాట విద్యార్థుల భవితను బంగారు బాటగా మారుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య పేర్కొన్నారు. కొత్తూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎక్కడా లేని విధంగా మన ఊరు.. మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా బోధనలో మార్పులు చేస్తూ ఒకటవ తరగతి నుంచే ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులను చేర్పించి పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీలత, ఉన్నత పాఠశాల హెచ్ఎం భాగ్యమ్మ, నాయకులు దేవేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొందుర్గు: బడిబాట కార్యక్రమంలో భాగంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ పాఠశాలల్లో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొందుర్గు, చౌదరిగూడ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఎంఈఓ కిష్టారెడ్డి చేతులమీదుగా అక్షరాభ్యాసం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలను పాఠశాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ నేడు గ్రామాల్లో పల్లెప్రగతి ఉత్సవాలు

చేవెళ్ల: నేడు దశాబ్ది ఉత్సవాల్లో పల్లె ప్రగతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ముందుగా గ్రామాల్లో జాతీయ జెండా అవిష్కరణ కార్యక్రమం, పంచాయతీ సిబ్బందికి సన్మానాలు, గ్రామ సభలు నిర్వహించుకుంటారని చెప్పారు. అనంతరం మధ్యాహ్న సమయంలో గ్రామాల్లో ఉన్న ప్రకృతి వనాల వద్ద వనభోజనాలు చేసే కార్యక్రమాలు ఉంటాయని ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులంతా భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా బ్యానర్లు కట్టి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

❖ నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి

చేవెళ్ల: నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు పామెన భీం భరత్, షాబాద్ దర్శన్‌లు అన్నారు. మండలకేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన యువకుడు చక్రపాణి కుటుంబాన్ని కాంగ్రెస్‌పార్టీ నాయకులు బుధవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేదకుటుంబాలను ఆదుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. మృతుడు చక్రపాణి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, వార్డు సభ్యుల మల్గారి మల్లారెడ్డి, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సుశాంత్, చేవెళ్ల పట్టణ ఉపాధ్యక్షులు అభి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

❖ విద్యతోనే అన్ని రంగాల అభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: విద్యతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసాన్ని ప్రధానోపాధ్యాయుడు రాములు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల పాల్గొని అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్య అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్య అభివృద్ధిలో మార్పు వచ్చిందని బడీడు పిల్లలను బడిలో చేర్పించి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.

❖ ఘనంగా చేగువేరా జయంతి

షాద్‌నగర్‌రూరల్: మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న ఐటీఐ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విప్లవ వీరుడు చేగువేరా 95వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, నాయకులు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... అర్జెంటీనాలోని ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన చేగువేరా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. డాక్టర్ విద్యను అభ్యసించిన ఆయన పేదల కోసం పాటు పడ్డారని అన్నారు.

❖ అంగన్‌వాడీ, ఆశలకు టీఏ, డీఏలు ఇవ్వాలి

చేవెళ్ల: ఈనెల 16న ఆదిలాబాద్ జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రారంభమయ్యే జీపుజాతను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ జీపుజాత వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌లకు బడ్జెట్ పెంచాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని రద్దు చేసి 45వ ఐఎల్‌సీ ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం 26000లు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ జీపు జాత కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

ఎంవీఐ బాలునాయక్



బాలు నాయక్, ఎంవీఐ

షాద్‌నగర్: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సులకు విధిగా ఫిట్‌నెస్ చేయించాలని షాద్‌నగర్ ఎంవీఐ బాలునాయక్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్ ఎంవీఐ పరిధిలో సుమారు 120 పాఠశాల, కళాశాల బస్సులు ఉన్నట్లు, ఇప్పటి వరకు 94 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకున్నట్లు తెలిపారు. మరో 26 బస్సులు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉందని అన్నారు. తనిఖీల్లో ఇప్పటి వరకు రెండు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఫిట్‌నెస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. లేని పక్షంలో చట్టరీత్యా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థల బస్సులు విధిగా పసుపు రంగులోనే ఉండాలని, బస్సు నడిపే డ్రైవర్‌కు హెవీ వెహికిల్ లైసెన్సు కల్గిగి పొంది ఉండాలని అన్నారు. అదేవిధంగా డ్రైవర్ వయస్సు 60 ఏళ్ళలోపు ఉండాలని, బస్సు నడిపేందుకు డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ళ అనుభవం ఉండాలని చెప్పారు. బస్సులపై విధిగా కుడి ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలని సూచించారు. డ్రైవర్ లైసెన్సును పాఠశాల యాజమాన్యం విధిగా ఆర్టీఏ కార్యాలయంలో అందించాలని, బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలని సూచించారు. బస్సులో అత్యవసర ద్వారం, బస్సు డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబరుల విధిగా బస్సుపై ఉండాలని పేర్కొన్నారు. ప్రతి నెల డ్రైవర్లకు బీపీ, షుగర్, కంటి పరీక్షలను విధిగా చేయించాలని సూచించారు. రోడ్లపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటించకుండా రోడ్లపై బస్సులను నడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కల్గుతోందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అయ్యవారిపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని తెలిపారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, వెంకట్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రమేష్, గోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’తో దృష్టి సమస్యలు దూరం

మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివారెడ్డి



వృద్ధులకు కళ్ళద్దాలను అందజేస్తున్న శివారెడ్డి

చేవెళ్ల: ప్రభుత్వం పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే కంటి వెలుగు పథకాన్ని తీసుకువచ్చిందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, మల్కాపూర్ సర్పంచ్ శేరి శివారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి పరీక్షలు చేసి దృష్టి లోపాలను దూరం చేయడమే లక్ష్యంగా కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల వారి నుంచి వృద్ధుల వరకు పరీక్షలు చేసి మందులు, కళ్ళద్దాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్‌లు అవసరమైన వారిని ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాఫర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కంటి వెలుగు శిబిరం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

కేశంపేట: మండలంలోని చింతకుంటపల్లిలో ఆంజనేయస్వామి ధ్వజారోహణ, శివ, శ్రీనందీశ్వర, నవగ్రహారాధన, కోట మైసమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం గ్రామంలో ఆంజనేయస్వామి, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల , బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె ఆనంద్‌కుమార్‌లు పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ అనురాధ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, రమేష్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఏబీవీపీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

కొత్తూరు: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కన్వీనర్ నరేషచారి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం శంషాబాద్, ఇబ్రహీంపట్నం విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్‌తో పాటు నరేషచారిలు మాట్లాడుతూ... గత కొన్నేళ్ల నుంచి మండలకేంద్రంలో జూనియర్ కళాశాల, ఐటీఐ(వృత్తి విద్యాకేంద్రం)ను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపట్టినట్లు వివరించారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు, పాలకులు కనీసం ఈ అంశంపై స్పందించక పోవడం దారుణమన్నారు. మండలంలో వందలాది పరిశ్రమలు ఉన్నప్పటికీ ఇక్కడి యువతకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కనీసం వృత్తి విద్యాకేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. దీంతో స్థానిక యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం..మరికొందరు అనుభవం లేదనే కారణంతో స్థానిక పరిశ్రమల్లో చిన్న చిన్న పనులు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాల, వృత్తి విద్యాకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, శ్రీకాంత్, హర్షవర్ధన్‌యాదవ్, తేజ, విష్ణు, అలోక్, సోహిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఆగ్రహం

- పంచాయతీ ద్వారా బిల్లులు చెల్లించం
- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ఆరోపణ



అధికారిని నిలదీస్తున్న సర్పంచ్‌లు

మొయినాబాద్‌రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ నక్షత్రం జేవంతు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నక్షత్రం అధ్యక్షతన మండల అభివృద్ధి అధికారి సంధ్య ఈ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఎంపీపీ నక్షత్రం ఎజెండా అంశాలను చదివి వినిపించారు. కరెంటు సమస్యపై అధికారి మాట్లాడుతుండగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు విద్యుత్ సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయని వాపోయారు. విద్యుత్ అధికారులు గత నాలుగు సంవత్సరాల నుంచి ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం నిర్వహించలేదని సమస్యలు మరింత పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఎత్‌మార్‌పల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగిలి ఓ వ్యక్తి మరణించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పటికీ ప్రమాదకరంగానే ఉందన్నారు. ఎన్కెపల్లిలో ఇనుప స్తంభాలు తొలగించాలని ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోరా అని ఆ గ్రామ సర్పంచ్ చందన నిలదీశారు. కరెంటు సమస్యలు పరిష్కరిస్తేనే గ్రామ పంచాయతీ బిల్లులు చెల్లిస్తామని సర్పంచ్‌లు చందన, మహేందర్‌రెడ్డి, శోభ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్‌లు సభ ముందు వాగ్వాదానికి దిగారు. అనంతరం ఎంపీపీ నక్షత్రంజేవంతు మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు పెరుగుతున్నాయని వాటిని దశలవారీగా పరిష్కరించుకుందామని చెప్పారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మమత, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, శోభావెంకట్‌రెడ్డి, నవనీతరాజు, శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రవణ్, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, మండల అధికారులు ఎంఈవో వెంకటయ్య, పశువైద్య అధికారి దేవిరెడ్డి, వ్యవసాయ అధికారి రాగమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ రమ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.